
# వన్ వే లవ్



ధనరాజ జ్ఞానేశ్వర్

రంజిత్ నాకు చిన్నతనం నుంచీ తెలుసు!

వాడూ, నేనూ చిన్నతనంలో ఒకే స్కూల్లో, ఒకే తరగతిలో, ప్రక్క ప్రక్కనే కూర్చుని చదువుకున్న కారణంగా మా ఇద్దరి మధ్య సాన్నిహిత్యం కూడా బాగానే వుంది.

కాలేజీ చదువుల కారణంగా వాడు చదువుకోవడానికి హైద్రాబాద్‌లోని ఏదో కాలేజీకి వెళ్లడంతో మా మధ్య స్నేహానికి తెర దించినట్లయింది.

ముఖాముఖంగా మాట్లాడుకున్నంత సన్నిహితంగా , ఉత్తరాల్లో మాట్లాడుకునే అవకాశం ఇద్దరికీ లేకపోయింది.

'ఉభయకుశలోపరి' – అంటూ వ్రాసుకునే ఉత్తరాలకు విలువా, ప్రాధాన్యమూ అంతగా వుండవని నా నమ్మకం. ఆరు నెలల తరువాత అవీ రాకపోవడం వల్ల ఆ నమ్మకం మరింత బలపడింది.

'విడిపోయాము' అన్న మాట మా యిద్దరి మధ్య సరైంది కాదు. ఎందుకంటే – మేమిద్దరమూ 'కలుసుకోము' అన్నమాట నిజమేగానీ, ఒకవేళ ఏ కారణంగానైనా కలుసుకోవడం అన్నది సంభవిస్తే – అది దాదావు రెండు గంటల మీటింగ్‌లా తయారయ్యేది. నిజానికి ఆ సమయం చాలా తక్కువ. ఎందుకంటే వున్న ఆ కొద్దిపాటి వ్యవధిలో ఎన్నో విషయాలు చర్చకు వచ్చేవి. ఈనాటి చదువులూ, రాజకీయాలు, సినిమాలు, ఆటలు మొదలుకొని ఒకనాటి తీపి జ్ఞాపకాలు వగైరా వగైరా ... అన్ని విషయాలు తేలిగ్గా మాట్లాడుకునేసరికి జీవితంలో అనుభవించిన, అనుభూతి చెందిన ఎన్నో విషయాలు చర్వితచరణం అయ్యేవి.

'ప్రతి పెళ్లయ్యే మగాడి జీవితపు మొదటి భాగంలో ఒక స్త్రీ వుంటుంది' – అన్నది నాకు తెలిసిన నిజం.

ఓ సందర్భంలో తీరిగ్గా కలిసిన రంజిత్‌తో ఎందుకో ఆ విషయం ప్రస్తావనకు వచ్చింది–

చిన్ననాటి మిత్రుడు గదా! వాడికి నాతో అబద్ధం చెప్పాల్సిన అవసరం కలిగివుండదు. అందుకే నిజం చెప్పాడు –

"ప్రతి మగాడివిజయం వెనుక ఓ ఆడది వుంటుందన్న విషయం నా విషయంలో నిజంకాలేదుగానీ ఒరే! నీవు చెప్పిన విషయంలో మాత్రం నిజమే!"

## పిల్లి శకునం మంచిది కాదు అని ఎందుకు అన్నారు?

సాధారణంగా ఏదైనా పని మీద బయలుదేరేటప్పుడు, పిల్లి ఎదురైతే అపశకునంగా భావించి వెనక్కి తిరిగి వెళ్ళి కాసేపు ఆగి వెళ్ళడం గాని, లేదా ఆ రోజుకు ప్రయాణాన్ని వాయిదా వేసుకోవడం గాని జరుగుతూ వుండడం మనం చూస్తూనే వుంటాం. అందులోనూ నల్లపిల్లి మరీ అశుభమని కూడా అంటూవుంటారు. అలా ఎందుకంటారో తెలుసా!

పిల్లి అశుభకరమన్నది కేవలం మూఢ నమ్మకం మాత్రమే. ఈ మూఢ నమ్మకం కొన్ని వేల సంవత్సరాల నుండి ప్రజలలో పాతుకొని పోయి వుంది. ప్రాచిన కాలంలో ఈజిప్టు దేశవాసులు పిల్లిని పూజించేవారు. వారికి 'పాష్ట్' Poshtఅనే దేవత వుంది. ఆదేవత పిల్లి ఆకారాన్ని పోలి వుంటుంది. ఆ దేవతకు తొమ్మిది జన్మలుంటాయని వారి నమ్మకం. ఈజిప్టులో నల్లపిల్లి చనిపోయినప్పుడు దాని మృత శరీరాన్ని భద్రపరచేవారు. త్రవ్వకాలలో ఒకసారి ఈజిప్టులోని ఒక సమాధి నుండి కొన్ని వేల నల్ల పిల్లుల




శవాలు లభించాయి. పిల్లిని చంపటం నేరంగా భావించి, నేరస్తులకు ఉరిశిక్ష విధించేవారు. దానితో నల్లపిల్లి అంటే ప్రజలకు భయం పుట్టింది.

మధ్యయుగం నాటి భూతవైద్యులు మందులు తయారుచేసేందుకు ఎప్పుడూ నల్లపిల్లి పుర్రెనే ఉపయోగించే వారని ప్రతీతి. తత్ఫలితంగా ప్రజలంతా నల్లపిల్లి మంచిది కాదని భావించేవారు. అదే భావన అనేక శతాబ్దాలుగా ప్రజలలో కొనసాగుతూ వస్తోంది. ఈ విధంగా ప్రజలు ఈ విధమైన మూఢ నమ్మకం బారి నుండి బయట పడలేకున్నారు. నిజానికి పిల్లి నల్లనిదైనా, తెల్లనిదైనా, ఏ రంగుదైనా అపశకునమూ గాదు, అశుభకరమైనది అసలే కాదు.

– ఎస్. రాజేశ్వరరాజు

10-9-93 ఆంధ్రజ్యోతి వారపత్రిక

"ఇంతవరకు నువ్వు దేని విషయంలోనూ విజయం సాధించలేదు కదరా! నీ వెనుక ఆడది వుండే అవకాశం లేదులే!" నవ్వుతూనే రిటార్టిచ్చాను నేను.

తనూ నాతోపాటు నవ్వి - "నాకో కొడుకురా! అది సాధించాను గదా!" అన్నాడు.

వాడలా అంటుంటే చిర్రెత్తుకొచ్చింది నాకు-

"కొంపదీసి నువ్వుగానీ కన్నావా ఏంటి? మా చెల్లాయికి అవస్థ తప్పుతుందన్న ఉద్దేశ్యంతో-" అన్నాను చిరుకోపాన్ని, నవ్వునీ ఒకేసారి మిళితం చేసి,

వాడా మాటలకు గలగలా నవ్వి - "ఓడిపోయానుగానీ, నాప్రణయ వృత్తాంతం వింటావా?" అనడిగాడు ఉత్సుకతగా.

కొన్ని విషయాలుంటాయి - అవి ఎవరు, ఎలా చెప్పినా, వినాలన్నా ఉత్సాహం కలుగుతుంటుంది. అలాంటిదే - వ్యక్తుల ప్రణయగాథలు.

"చెప్ప ...చెప్ప.. కాని లేనిపోని గొప్పలు మాత్రం చెప్పకు. నాకసలే చిరాకు!" అన్నాను.

"ముడిసరుకు అందిస్తాను. దానిని రుచికరమైన వంటగా మార్చాల్సిన రచయితవి నువ్వే!" అన్నాడు వాడు.

"మొదలు పెట్టు..." అన్నాను - వాడు చెప్పే విషయాలను శ్రద్ధగా వినడానికి సిద్ధమవుతూ.

* * *

**ఆమె పేరు కవిత.**


**నిజంగానే కృష్ణశాస్త్రి భావకవిత్వమంత అందంగా వుంటుందామె.**

మనుషుల మనస్తత్వ శాస్త్రి ప్రకారం - "అందమైన అమ్మాయి తనని దాటి, పదడుగుల దూరం వెళ్లినా గాని, తల తిప్పి వెనక్కి చూసి, ఆమె నడుము తాలూకు వంపులనీ, భుజాల తాలూకు నునుపునీ, నడక తాలూకు హొయలునీ, సన్నని అందమైన నడుము మీద లయబద్ధంగా కదులుతున్న జడ తాలూకు అందాన్ని చూడడానికి ఇష్టపడే అందం-" కవితది.

**అంటే దానర్థం - కవిత మాటికి నూరు పాళ్లు అందమైనదేననే కదా!**

'అందం' ఆమెకు అలంకారమైతే, ఆమె తన బావగారింట్లో వుండడం కుర్రకారుకి ఆకర్షణ.

ఆ ఆకర్షణకి కారణం - ఆమె బావగారుకాలేజీ లెక్చరర్ కావడం - అంతటితో ఆ ఆకర్షణ పెరిగిందనడానికి వీల్లేదు. అతను చెప్పేది ఆప్షనల్స్ కావడం మరో ప్లస్ పాయింట్.




సాధారణంగానే ఆప్షనల్స్ అర్థంకాని విద్యార్థులు ట్యూషన్స్‌కి రావడం జరుగుతుండేదే.

కాని ఇక్కడ ఆ సంప్రదాయం కాస్త రివర్సయ్యి, 'కవిత'ను 'చూడ'గలిగే 'అవకాశం' దొరుకుతుందన్న ఉద్దేశంతోనే చాలామంది ఆమె బావగారి దగ్గరకు ట్యూషన్స్‌కి వచ్చేవారు తప్ప, ఆయన ట్యూషన్లో చెప్పే విషయాల ద్వారానే తాము 'స్టేట్ ర్యాంకు'లు సాధించాలన్న కోరికతో మాత్రం కాదు.

బావగారు మాత్రం పిల్లలు ట్యూషన్స్‌కి రావడం అంతా తన 'ప్రతిభ' కారణంగానే అని తనలో తాను ఏదేదో ఊహించుకుని తెగ ఫీలైపోయేవాడు. (కవిత పెళ్లి జరిగిన తరువాత తన ట్యూషన్లు సరిగా ఎందుకునడవడం లేదన్న విషయంలో కారణం ఆయనకు తెలిసి, "జౌరా!" అనుకున్నాడనుకోండి! అది వేరే విషయం!)

అలాంటి కవిత మీద రంజిత్ దృష్టి పడింది. స్వాభావికంగానే 'అందాన్ని' ప్రేమించడం అదో 'ఫ్యాషన్' అనుకున్న రంజిత్, కవితను చూసిన తరువాత తనకు తెలియకుండానే ఆకర్షణకు లోనయ్యాడు.

కాని - కవితకి అప్పటికే - రంజిత్‌లాంటి బచ్చాగాళ్లని వంద మందికి పైగా నిర్లక్ష్యం చేసిన ఎక్స్‌పిరియెన్స్ వుంది.

రంజిత్ ఒక లెక్కా?

వాడి 'ఆరాధనా'పూర్వకమైన చూపులని తేలికగా చిరునవ్వుతో తీసి పారేసింది.

ప్రేమలేఖని అందుకోవడం, ప్రేమ కానుకలను అందుకోవడం, చిలిపి చూపులతో మాట్లాడడం ఆమెకు కొత్త కాదు.

ట్యూషన్స్‌కి వచ్చేవారు ఏదో వంకన మాట్లాడుతూ వుండడంతో ఆ అనుభవం ఆమెకు అలవడింది.

అవన్నీ ఓ లెక్కలోనివి కాదు కాబట్టి - రంజిత్ వ్రాసిన ప్రేమలేఖలు కూడా రొటీన్‌గానే చెత్తబుట్టకు దాఖలయ్యాయి.

ఇచ్చిన కానుకలు మాత్రం భద్రంగా దాచుకుని, వాటిని తన ఫ్రెండ్స్ ముందు ప్రదర్శనకు పెట్టేది కవిత.

వారంతా అందరి కానుకలతోపాటు రంజిత్ పంపిన కానుకలనుచూసి, కవిత అదృష్టానికీ, అందానికీ ఈర్ష్య చెందేవారు. బయటికి మాత్రం కవిత నవ్వుతో వంతపాడేవారు.

ఇవేవీ తెలియని రంజిత్ - కవిత అందరికన్నా తననే ఎక్కువగా ప్రేమిస్తుందని గుడ్డిగా నమ్మాడు. ఆమెనే ఆరాధించాడు.

చదువు కోసం పట్నం వెళ్లిన కుర్రాడికి, చదువు తప్ప ఇంకో ధ్యాస ఎక్కువైందని గ్రహించాడు రంజిత్ తండ్రి.

నిజాలెంతో తేల్చుకోవాలని ప్రయత్నిస్తే ఏకంగా ఋజువులే దొరికాయి.

కొడుకును నిలేస్తే - నిజాయితీగా అంతా చెప్పి - ఆ అమ్మాయే తన భార్య కావాలని చెప్పాడు చివరికి.

అతని ధోరణి చూసి హతాశుడయ్యాడు తండ్రి.

'ముందు చదువు కానీ'' - అన్నా వినే స్థితిలో లేదు రంజిత్.

"చదువుదేముంది? అవకాశం దొరికితే జీవితాంతంచదవచ్చు. కాని అదృష్టం చేజారితే..."

కవిత అతని "అదృష్టం!"

ససేమిరా వీల్లేదనీ, చదువు ముఖ్యమనీ నిక్కచ్చిగా చెప్పాడతని తండ్రి.

ఆ మాట చెప్పి - ఊరికి వచ్చేసిన మర్నాడు అతని వెనకే ప్రయాణం చేసినట్టుగా అందిందో టెలిగ్రాం - రంజిత్ మిత్రులు చేసింది.

వార్త అందిన మరుక్షణమే పట్నం వెళ్లాడు హుటాహుటిన -

రంజిత్ ఆత్మహత్యకు ప్రయత్నించడం, నిద్రమాత్రలు మోతాదు మించి మింగడం, సమయానికి అతని మిత్రులు గమనించి హాస్పిటల్లో చేర్చి వైద్యం చేయించటం, హడావిడిగా తండ్రికి టెలిగ్రాం ఇవ్వడం - అందరూ కథలు కథలుగా చెప్పకోవడం క(వి)నిపించింది రంజిత్ తండ్రికి.

ఆవేశంతో కొడుకు చేసిన అఘాయిత్యానికి బావురుమన్నాడా తండ్రి. తల్లిలేని పిల్లవాడని గారాబంగా పెంచినందుకు, ఆఖరి క్షణంలో పశ్చాత్తాపం చెందాడాయన.

బెడ్ దగ్గర ఎవరూ లేని సమయంలో చెప్పాడు - "నీకు నచ్చిన అమ్మాయితోనే నీ పెళ్లి జరుపుతానురా నాన్నా! ఇంకోసారి ఇలాంటి అఘాయిత్యం చెయ్యకు!" అని.

అంత నీరసంలోనూ భృకుటి ముడేసి - "అది సాధ్యం కాదు నాన్నా!" అన్నాడు వింతగా.

"నేను పెళ్లికి ఒప్పకోననే కదరా ఇంత పని చేశావ్! మరి సాధ్యంకాదంటావేం?" అనడిగాడతని తండ్రి కంట్లో నీరు తుడుచుకుంటూ.

"నిన్ను ఒప్పించాలని నేను ఆత్మహత్య చేసుకోలేదు నాన్నా! నిన్ను ఒప్పించడం నాకుతేలికే! కాని కవితను ఒప్పించలేకే ఈ పని చేశాను" అంటూ బావురుమన్నాడు రంజిత్.

విచిత్రంగా "ఏమయ్యిందిరా?" అనడిగాడు విషయం సగం అర్థమై, అర్థంగాక.

"కవిత తను ఇష్టపడ్డ ఓ ఇంజనీర్ని పెళ్లిచేసుకుంది" అంటూ చిన్నగా మగతలోకి జారిపోయాడు.

"అమ్మయ్య! ఓ గండం గట్టెక్కింది!" హాయిగా నిట్టూర్చాడు రంజిత్ తండ్రి.

* * *

అదంతా చెప్పి, చెమర్చిన కళ్లను తుడుచుకున్నాడు రంజిత్.

ఇదంతా జరిగి ఐదుసంవత్సరాలవుతోంది.

రంజిత్‌కి ఇప్పడు పెళ్లయి, ఓ కొడుకూ వున్నాడు.

ఇంత జరిగినా, తనని తృణీకరించినా కవిత మీద అతనికి ద్వేషంగానీ, కోపంగానీ లేవు.

ఉన్నదంతా ప్రేమే! ఆకర్షణే!! ఆరాధనే!!!

ఇప్పడూ ఆమె విషయం చెపుతూ, అందులో తన్మయం కావడమే అందుకు నిదర్శనం!

కొద్దిమంది కేవలం ప్రేమించడానికే పుడతారు - వారికి ద్వేషించడం చేతకాదు.

రంజిత్‌కి ద్వేషించడం అసలు చేతకాదు.

వాడో ప్రేమమూర్తి - అందుకే వాడంటే నాకు గర్వకారణం.



***స్నేహితులారా నేనిక్కడ మీరెక్కడ?**

ఎనిమిది సంవత్సరాల క్రితం థర్డ్ బి.ఎస్‌సి. మిత్రులతో దిగిన ఫోటో. ఎడమవైపు క్రింది వరుసలో రెండవవాణ్ణి. మీరు ఎక్కడెక్కడ వున్నది తెలియజేయండి.

సిహెచ్. రమేష్‌బాబు, క్వార్టర్ నెం. 107 'బి' టైప్, హౌసింగ్‌బోర్డ్ కాలనీ,
అదిలాబాద్-504 001




స్వర్గం — నరకం

మార్క్ ట్వైన్ ఒకసారి లండన్ నగరంలో ఒక సాహిత్య సమావేశంలో ప్రసంగించడం పూర్తయింది.

సభానంతరం ఒక సాహిత్యాభిమాని లేచి "అసలు షేక్స్‌పియర్ వ్రాసిన నాటకాలుగా చెలామణీలో వున్న ఈ నాటకాలన్నీ షేక్స్‌పియరే వ్రాశాడా? లేక మరెవరైనా వ్రాశారా?" అన్నాడు. "నీ అనుమానం నాకూ వుంది. అయితే నేను స్వర్గానికి వెళ్ళి స్వయంగా షేక్స్పియర్‌నే ఆ విషయం అడిగే వరకూ నీవు ఆగవలసి వుంటుంది" అని చెప్పాడు మార్క్ ట్వైన్.

వెంటనే అతడు "అసలు షేక్స్పియర్ స్వర్గంలో ఎందుకుంటాడు? ఆయన వుంటే నరకంలో వుంటాడు కదా?" అన్నాడు మళ్ళీ.

దానితో మార్క్ ట్వైన్‌కు వళ్ళుమండి "అయితే నువ్వెలాగూ అక్కడికే వెడతావు కాబట్టి ఆ సంగతి నువ్వే అడిగి తెలుసుకోవడం మంచిది" అన్నాడు.

హిమజా రమణ